1980 లో ఆరు నెలలపాటు పల్లెలో వున్న "ఆమె"కి పట్నంలో ఉన్న "అతనికి" మధ్య సాగిన ఇరవై 'జీవన ప్రేమ లేఖల' ఇరువైపుల ప్రణయగాథ ఇది.

వసంత, చంద్రయ్యలు పల్లెలో విరబూసిన ప్రేమమయ జంట. చంద్రయ్య పరోపకారబుద్ధి, అధునాతన భావనలు, తక్కువకులం అనే సాంఘిక నియమం కలసి వసంతతో వేరుచేశాయి. వసంత సామాజికంగా 'ఉన్నత వర్గం' అనే కులంలో పుట్టిన పడచు. ఆమెకు కులం పట్టింపులు లేవు. కానీ, ఊరి పటేండ్లకు ఆ పట్టింపులున్నాయి. ఆమె తన తండ్రీ, తమ్మునితో కడుపుకింత కూడు లేక బాధపడి చస్తున్నా 'కులం' 'అయ్యో' అనలేదు. కానీ, చంద్రయ్యను రేపు పెళ్లి చేసుకుంటుందేమో నని అధికారులైన ఊరిపెద్దలు బెంబేలెత్తిపోయారు. అందుకే అతన్ని చంపే ప్రయత్నం చేశారు.

చంద్రయ్య పేదరైతుకూలి. పల్లెలో ఉన్నా, పట్నంలో ఉన్నా రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి తనది. అతనికి తల్లీ తండ్రీ లేరు. చిన్ననాడే తల్లి చనిపోతే అక్క పెంపకంతో పెరిగి పెద్ద వాడయ్యాడు. అతను ఊరి పరిస్థితి గమనించి ఊరు విడిచి పట్నం చేరాడు. పట్నంలో మూసీనది అంచునున్న బస్తీలో వుంటూ, మూసీ ఒడ్డున అర ఎకరం పొలమున్న ఓ కుటుంబానికి జీతగానిగా కుదిరాడు. గడ్డి కోసి, బర్లను మేపి, పాలు పిండి రాతాలు పోసి జీవనయానం సాగిస్తున్నాడు.

పల్లెలో ఉన్నా పట్నంలో ఉన్న అతని హృదయం మాత్రం వసంతకే అంకితమై వుంది. అతనో లేఖ రాస్తే...అక్కడ పల్లెలో పంటపొలాల్లో కూలీగా పని చేస్తున్న 'ఆమె' జవాబు రాస్తోంది. జబ్బు పడ్డ తండ్రి, రెక్కలు సరిగా రాని తమ్ముడు...పసుల కాపరి...

ఆమె పల్లెలో తన జీవితాన్ని గురించి రాస్తే, అతను పట్నం బతుకు గురించి రాసుకున్న ఉత్తరాలు ఇవి.

తెలంగాణ ప్రజల జీవన సరళిని అడుగడుగునా గుబాళించిన అద్భుతమైన శైలి ఈ లేఖల్లో మనకు కనిపిస్తుంది. ఇక చదవండి.....

–ఎడిటర్.



# పట్నమొచ్చిన పల్లె

## భూపాల్ · లేఖా నవలిక

లేఖ:1

4.9.1980, ఆదివారం

నా ప్రియమైన చంద్రానికి!

"నిటారు నిలువులు, పటారు బయళ్లు, మజ్జిగ ముంతలు, మాణిక్యాలు" పొడుపు కథ ఇవ్వ సూద్దాం! నీ ఉత్తరంల పట్నం ఫ్యాక్టరీల్ల పని చేసేటోళ్ల 'మిషిన్ల బతుకు' జెర్ర దెలిసింది. జిన్నాథం కలిస్తే చెప్త. మీ దోస్తు రామిరెడ్డికి ఎట్లున్నది? ఆ సంటిది బాగైందా?

నిన్న వినాయక చవితి. మనం చిన్నప్పుడు కోతికొమ్మ ఆడిన మబ్బు చింత ఒనగాయ ఇడిసింది. ఆ కాయ తెంపుకొచ్చి తుమ్మి కూర ఒండిన సిన్నతనమంత శిత్రంగ యాదికొచ్చి నవ్వుకున్న. తుమ్మికూర కమ్మగైంది. తమ్ముడు మూడుసార్లు కంకెడంత అన్నం బెట్టించుకొని తిన్నడు.

ఉత్తర కార్తి మొన్ననే ఒచ్చింది. "ఉత్తర పదును–ఉలువకు అదును" నిజంగనే ఇయ్యాల నల్లకంచె ఉత్తరానున్న గంటోని శెల్కల ఉలువలల్లుక పొయ్యినం. జొన్నసేలు, తైదసేలు కొందరు కోస్తున్నరు. చైత్రమాసంల ఉగాది పండుగ తెల్లారి పోయినవు నువ్వు, ఇది బాద్రపద మాసం. ఆరునెల్లు గడిసినయ్. ఎంత బరువుగనేకున్నవు. నిండ ఒడ్లున్న తూంగంప ఒక్కదాన్నే ఎత్తుకున్నట్టు.. యాదొస్తే గుండెనెవరో పిండుతున్నట్లుంది.

నాయిన ఇప్పడే నిద్ర పొయ్యిండు. జెర్ర పానం అల్కగుంది. ఆ తుర్క ముసలాయన రోజూ సూదులిచ్చిపోతుండు. ఒడ్లు పెడ్తమని చెప్పిన. ఇయ్యాల్ల పొద్దు మూకంగ శల్క కెల్లి అంబల్లబండ కాడి కొచ్చేటాల్లకు తమ్ముడు కంప కుప్పేస్తుండు. 'పసులేయిరా' అని అడిగిన. గొల్లాయినెంట కొట్టిచ్చి శితపల కాయలు కాలుద్దామని ఉన్నడట. కాయలింకా బాగా కాలేదు. ఎంత దేవులాడిండో బోడ పొంటి. ఇరవై గల్ల బుడిగెలు దొర్కినయ్. నాకు ఎంటనే నువ్వు యాదికొచ్చినవ్. పొయినేడు మనం తాలేలోడికల కాయలు కాల్చుక తిన్నది యాదికుందా?

తమ్ముడు శీను కంప దెస్తుంటే నేను అనగవట్టి నా చెప్పల కాళ్లతోటి తొక్కి కంప మీద కాయలేసిన. మల్లదెచ్చిన కంప కాయల మీదేసి నిప్ప ఊది ముట్టిచ్చినం.

చిమ్మ చీకటైంది. మిడతలో, లద్దె పురుగోవొచ్చి మంటల వడుతున్నయి. అవిటిని జూస్తుంటే ఆనికి ఉశిర్లు యాదికొచ్చినాయేమో "ఎప్పడన్నా ఉశిర్లు తిన్నావే?" అనడిగిండు.

"ఒకసారి ఆరుద్ర కార్తిల చంద్రయ్య ఉండంగ తిన్న" అని చెప్పిన. ఆడు జెర్రసేపు ఏమి మాట్లాడలేదు. ఉండుండి "చంద్రయ్య తానికి

పోదామా అక్కా" అని అడిగిండు. వుండు మీద కారం జల్లినట్టు, మొదలే కుంటికాలు దానికి తోడు పక్షవాత మన్నట్టు నా మనసంత అవిసిపోయింది. కండ్లనిండ నీళ్లు కమ్మినయ్. కాలిన కాయను సుంచుకుంట కిందికి జూసు కుంట నా మొకం ఆనికి జూపెట్టొదనుకున్న, కని ఆడు అంతా జూస్తుండు. ఇగ ఏడుపా గలే. కాయలెంత ఇష్టమున్నా తినబుద్ది గాలే. మంటనార్పుదామని నూసిన ఆరేటట్టు లేదు. ఇంకా ఆడవుండక శిత్తలికొమ్మలు దెచ్చి కాలిన కాయలమీద గొట్టి నల్లగ జెయ్యాలన్న ఒంక తోటి మంటకు దూరం వొయ్యి చెట్టుకాడ కండ్లు బాగ తూడ్సుకొని వొచ్చిన. "నేను వోత. నాయిన ఎదురు జూస్తడు. బువ్వొండాలె" అను కుంట బాట వట్న. అప్పటికే ఆడు కాయలన్నీ మంటలకెల్లి ఏరి తీసి గోనె బస్తల ఏస్తుండు. ఒస్తుంటే తొవ్వల జెప్పిండు "గొల్ల కొమరయ్య గొల్ల చిన మల్లయ్యను గిట్ల పది మందిని పోలీసులు పట్కపొయ్యిండ్రని." ఎందుకంటే సుధాకర్‌రెడ్డి కాల్రగొట్టిండ్రటట అన్నడు. అప్పడ ర్థమైంది. ఇయ్యాల్లనో రేపో అని అనుకున్న పని జరిగిందన్నమాట.

గొల్ల చిన్న మల్లయ్య బిడ్డె శారద పోయిన వున్నమినాడు ఊరికొచ్చింది. అది ఎంత బాగయ్యిందనుకున్నవ్ ముద్దబంతి వువ్వనుకో. సదువుల ఇంటర్ ఎల్లదీసింది. ఉప్పలకాడ ఆల్ల మేనమామ సదివిచ్చిండు. అది రాంగనే దాని మీద రామచంద్రరెడ్డి రెండో కొడుకు నీతోటి చదివిన సుధాకర్ కన్నుపడ్డది. ఇదివొరకు ఇద్దర్ని మోసం జేసినట్టు దీన్నీ జేద్దామనుకుండు. పదిహేను రోజులు దాని కావలి గాశిండు. అది కనిపించకుంటే గోడలెక్కి, మిద్దెలెక్కి, చెట్లెక్కి సూడవట్టె. అప్పటికే పోకిరి శాతలు జేసుకుంట ఆట వట్టిస్తుంటే మన రైతుసంఘపోల్లు పసిగట్టి తంతామని జెప్పిండ్రు. ఆనికి బుద్ధి రాలే. ఇంగ ఇట్లు కాదని గొల్లోల్ల కులపెద్దలిద్దరు వొయ్యి పెద్దపటేలు తోనే "మీరు పెద్ద కులపోళ్లు మీ కింద బతికేటోళ్లం మేము. మీ దుడ్డెగాని సంగతి సూడ బాగలేదు. జెర్ర మెడకు మొద్దెయ్యిండ్రి. కాకుంటే కులం పిల్లను దెచ్చి పెండ్లి జెయ్యిండ్రి. అని చెప్పిండ్రట. ఆయన అట్లనే అని ఊకున్నడు.

అప్పటిసంది సుధాకర్ పదిమంది కండ్లవడె టట్టు జేస్తలేదు గని, ఊళ్లె పనిలేని పోరగాళ్లను ఎంటేసుకొని పంచాదులు పెట్టవట్టె. ఈల లేయవట్టే. పట్నంల ఉన్నన్ని రోజులేమో ఏదో మతసంఘంల పనిజేసిండట. సదువు సక్కగ లేక ఫేలయ్యి అక్కడ సదువుగాక, కొలువు జెయ్యలేక ఊరికొచ్చిండాయె. ఇగేం దోయక

OO

**నా మొగుడు చంద్రయ్యే అని చెప్పే ధైర్యమున్నదాన్ని అని అంటున్న తెలంగాణా పడుచు ప్రేమ పర్వం ఇది**

OO

ఊరు పాడుజేసుడే పనాయే.

ఇంతల శారదను మొన్న చౌదర్‌పెల్లి నుండి సూడొచ్చిండ్రు. పిల్ల నచ్చి అన్ని మాట్లాడుకొని దీపావళి లగ్గాలల్ల ఖాయం అనుకున్నరు. ఆళ్లు పోయినంక రెండు రోజులకు పిల్లనొల్లమని చెప్పంపిండ్రు. ఏమైందో ఎవ్వరికి తెలువదు. నడుమున్న మనిషిని మెల్లగ ఆయం దీస్తే పిల్లను జూడొచ్చినోళ్లు పోతున్నప్పుడు ఊరు దాటంగనే చింతలకాడ ఎవరో కలిసి పిల్లకు ఆల్ల బావ తోటి ఒకసారి కడుపైందని చెప్పిం డ్రట. ఆ చెప్పినోడు ఈ ఊరోడు గాదు. ఎవ్వరు గుర్తుపట్టలేదు గని ఆడొచ్చి సైకిల్ మీద వోతుంటె శింతకాయ దెంపుతున్న తెనుగు మారెమ్మ జూసి ఆయల్ల సింగారం మనిషి సైకిల్ మీద ఒచ్చిండని జెప్పిందట–మల్లయ్య పెళ్లాంతోటి. అంతే తెల్లారే సింగారం వొయ్యి ఆన్ని ఎట్ల పట్టిండ్రోగని నాల్గు సప్పరిస్తే అదు సుధాకర్‌రెడ్డి చెయ్యిమన్న పనులన్ని వూసగుచ్చి నట్టు చెప్పకొచ్చిండట. పైసకాశవడ్డనన్నడట. మన ఊరిగొల్లోళ్లు తక్కువేం గాదు. తెల్లారే వరకు సుధాకర్‌రెడ్డిని సంవుతమని సోర సోర పోరలంత ఒక్కటైరి. ఊరి తూర్పున కావలి గాసిరి. ఆ సుధాకర్ సైకిల్ మోటార్ మీద వొస్తుంటే ఏనె గుండ్లకాడ అపి చిత్కగొట్టి సంపేసినమనుకొని ఏడికో లేకుండ దాటుకు న్నారు. ఎన్కశీర్కి పోలీసొచ్చింది. అప్పటికే ఆన్ని పట్నం ఏసుకొచ్చిండ్రు. పోలీసులు ఊళ్లె వున్న గొల్ల ముసలోల్లను పటేలు జెప్పినట్లు పట్కపోయిండ్రు. ఇదీ కథ.

చంద్రా! నా మీద గూడ ఊరిల వుకారు వుంది. ఐతె నేను అందరికి నిజంగనే చంద్ర య్యను జేసుకుంట కొట్టినా, తిట్టినా, కోసినా, నరికినా నా మొగడు చంద్రయ్యే అని చెప్పే ధైర్యమున్నదాన్ని. మన ఇద్దరి ముచ్చట వేరు. అదేం జేసిందని దానికా బద్లాం? ఐతే ఆడు పిలిసినప్పుడు రాలేదనే గదా దాని బతుకు నాశనం జేస్తందుకు నిలవడ్డదు. నాకైతే ఆనికి మంచి శాస్తి జరిగిందనే అనిపిస్తుంది. నాకే గాదు ఎవ్వరికైనా అట్లనే అనిపిస్తదేమో.

15–9–1980

రాత్రి పెద్దగ. ఉరుములు, మెరువులు. దీప మారిపోవట్టింది. తెల్లారి జూస్తే మెనుగోని రాళ్ల గట్టుకు పిడుగుపడి మర్రిచెట్టు సగం కాలిపోయింది. "ఉత్తరాన ఉరిమినా, పాము తరిమినా కురవకా, కరవకా విడువ"దం టారు. నిన్న ఉత్తరాన్నే ఉరిమింది మొగులంత గొంగడి తప్పింది. ఇక పాము తరిమి కరిసేది నేనైతే జూడలేదు. అది కరిసినా మంత్రం కన్నా మందులు మస్తుగున్నయ్. ఈ నడుమ ఒక పెద్దమనిషి మంచి మందు జెప్పిండు. ఎవ్వరికి జెప్పొద్దన్నడు. చెప్తే మందు పారదట. చెప్పి తినవెట్టినా చెప్పక తినవెట్టినా బెల్లం బెల్లమే, మిర్పకార మిర్పకాయే గదా! అందుకే నేను అందరికీ చెప్తున్న. ఎంతలేసే పామైనా సరే కరిస్తే తుమ్మికూర ఆకురసం అదే మనం వినాయక చవితినాడు కూర లొండుకుంటం సూడు అదే తుమ్మిఆకు రసం ఓ పెద్ద గిలాసెడు తాపితే మనిషి చావడు. ఇసం ఇరిగిపోతుందట. అదునుకు దొరకాలే గని ఇంతకన్న మనకేం గావాలే.

ఇంకా ఏం రాద్దూ! పాడువు కథ ఇష్టి తివా? తెల్వలేదా? అది 'కొబ్బరిచెట్టు' ఇగవోతే నువ్వు పంపిన రూపాయలందినయి. అందుకు నమస్తే! ఇయ్యాల పనికి పోలేదు. ఎన్నడూ లేంది ఈరోజు పొత్తికడువుల బాగా నొప్పి లేశింది. అందుకే పోలే. ఈ ఉత్తరం గూడ గడికింత గడికింత రాస్తున్న. అగో నాయిన పిలుస్తుండు మల్ల ఆపేస్తున్న.

పొద్దూకంగ.

చంద్రా! ఎగిరి గంతేసే సంగతి జెప్తున్న. ఇరువై తారీఖు నాడు నేనూ, నాయిన పదిగొట్టే బస్సుకు పట్నం ఒస్తున్నం. సైదబాదల దిగుతం. బస్సుకాడికి నువ్వు తప్పకుండ రా. అక్కడ మా మేనత్త ఒకామే ఉంటుంది. నాయిన కన్న పెద్దది. సూసి వొద్దామంటుండు. నేనైతే ఎప్పుడు రాలేదు. ఆళ్లు నాకు తెల్వదు. ఇంకా రాస్తే బాగుండదు. అన్ని ముచ్చట్లు కలిసినంక మాట్లాడుకుందాం. ఇరువై తారీఖు శనివారం మర్సిపోవద్దు.

నీ,

వసంత

15.9.1980.

◆